

రైతులను ఆదుకుంటాం: మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం కురిసిన అకాల వర్షాలు కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'విపత్తుల సమయంలో రైతులకు అండగా ఉంటాం. పిడుగుపాటుకు గురైన మృతుల కుటుంబాలను ఆదుకుంటాం. అధికారులు తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేయాలి. రానున్న రోజుల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులకు సూచనలు ఇవ్వాలి' అని మంత్రి తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు.

ఆ ఉప్పునకు ముప్పు

ఒకప్పుడు ఆ ప్రాంతంలోని పొలాలు ఉప్పు పంటతో కళకళలాడేవి. రైతులు నిత్యం ఉప్పు సాగులో బిజీగా ఉండేవారు. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పొలాల లీజు ముగియడంతో రెండేళ్లుగా ఉప్పు సాగు నిలిచిపోయింది. దీంతో ఆ పొలాలు బీడుగా మారి బీటలు వారాయి. ఉపాధి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఇదీ వజ్రపుకొత్తూరు మండలం పూడిగల్లి పరిసర ప్రాంతాల్లో రైతుల పరిస్థితి. అలాగే సంతబొమ్మాళి మండలం నౌపడ ఉప్పు పరిశ్రమదీ అదే దుస్థితి. ఒకప్పుడు దేశంలోనే మూడోస్థానంలో నిలిచిన ఈ ఉప్పు పరిశ్రమకు మూలపేటలో పోర్టు ఏర్పాటు కారణంగా గండం ఏర్పడింది. పోర్టుకు సంబంధించి అధికారులు భూములు సేకరించడంతో ఉప్పు గల్లీలు కనుమరుగవుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- పూడిగల్లి పరిసరాల్లో రెండేళ్లుగా నిలిచిన సాగు
- లీజు ముగిసినా.. రెన్యువల్‌కు ముందుకురాని కంపెనీలు
- ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న రైతులు

వజ్రపుకొత్తూరు, మే 5(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం పూడిగల్లి పరిసర ప్రాంతాలు ఉప్పును పండించడంలో ప్రసిద్ధి చెందాయి. బ్రిటీష్ పాలనలో ఉప్పుపై పన్నును వ్యతిరేకించి, ఉప్పు సత్యాగ్రహం పేరుతో కార్మికులకు సంఘీభావం తెలిపేందుకు మహాత్మాగాంధీ ఈ ప్రాంతానికి వచ్చి సమావేశం నిర్వహించిన చరిత్ర ఉంది. కానీ లీజు ముగిసిన నేపథ్యంలో గత రెండేళ్ల నుంచి ఈ ప్రాంతంలో ఉప్పు సాగు చేయకపోవడంతో రైతులకు ఉపాధి కరువవుతోంది. పూడిగల్లి ప్రాంతంలో సుమారు 1200 ఎకరాల ఉప్పు పొలాలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఉప్పుటేరు పారుతున్న కారణంగా పొలాల్లో ఉప్పు తప్ప.. మరే ఇతర పంట లు పండించడానికి అవకాశం ఉండదు. దీంతో ఈ పొలాలను వివిధ కంపెనీలకు లీజుకు ఇచ్చేవారు. సంబంధిత కంపెనీలు తమ ప్రతినిధులను ఇక్కడ నియమించి వారి ఆధ్వర్యంలో స్థానిక రైతులతో ఉప్పును పండించేవి. అందుకు ఒక్కొక్కరికీ రోజుకు రూ.300 నుంచి రూ.500 చెల్లించేవారు. ఈ విధంగా వజ్రపుకొత్తూరు మండలంలో కొండవూరు, శివ రాంపురం, తెరపల్లి, మాదిగాపురం, న గరంపల్లి, గల్లి, కూర్మనాథపురం, పూడిలంక, కొల్లిపాడు, సీతాపురం, పెద్దబొడ్డపాడు గ్రామాల నుంచి 300 మంది పనిచేసేవారు. అయితే, రెండేళ్ల కిందట పొలాల లీజు గడువు ముగిసినా సంబంధిత కంపెనీలు రెన్యువల్ చేయించుకోలేదు. కొత్త సంస్థలు కూడా ముందుకు రావడం లేదు. పోని స్థానిక రైతులే లీజుకు తీసుకుందామంటే వారికి అంత స్థోమత లేదు. దీంతో రెండేళ్లుగా ఉప్పు సాగు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూములు సైతం బీటలు వారుతున్నాయి. ప్రస్తుతం 100 మందికి పైగా రైతులు గ్రామాల్లో పనులు లేకపోవడంతో ఖాళీగా ఉంటున్నారు. చాలామంది యువకులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. ఉప్పు పండించడం తప్ప.. తమకు ఇతర పనులు తెలియవని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వలసబాట పట్టారు

ఉప్పు సాగు నిలిచిపోవడంతో మేమంతా ఉపాధి కోల్పోయాం. పని లేక యువకులు ఇతర ప్రాంతాలకు వలసబాట పట్టారు. దీంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. మాలాంటి వారమంతా గ్రామాల్లో ఉండిపోయాం. కుటుంబాన్ని పోషించడం భారంగా ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి. పింఛన్ కోసం రెండేళ్ల నుంచి ఎదురుచూస్తున్నా.

- లండ మహాలక్ష్మి, శివరాంపురం



ఇతర పనులు తెలియవు

చిన్నప్పటి నుంచి ఉప్పు పండించడం తప్ప నాకు ఇతర పనులు తెలియవు. రెండేళ్లుగా ఉప్పు సాగు నిలిచిపోవడంతో ఖాళీగా ఉంటున్నా. ఉపాధిహామీ పనులు 100 రోజులు మాత్రమే కల్పిస్తున్నారు. మిగిలిన రోజులు ఏమి చేయాలో తెలియడం లేదు. ఇన్నాళ్లు ఉప్పు పొలాల్లో పనిచేసినా, పింఛన్ సదుపాయం కల్పించలేదు. కనీసం సామాజిక పింఛన్ల జాబితాలో ఉప్పు రైతుల పేర్లు జత చేసి ఆదుకోవాలి.

- టొంప మోహనరావు, ఉప్పు రైతు, శివరాంపురం



శివరాంపురంలో బీటలు వారుతున్న ఉప్పు పొలాలు

'నౌపడ'కు తప్పని గండం

- మూలపేట పోర్టుకు భూముల సేకరణ
- ఇప్పటికే 293 ఎకరాలు స్వాధీనం
- కనుమరుగవుతున్న ఉప్పు గల్లీలు

టెక్కలి, మే 5(ఆంధ్రజ్యోతి): నౌపడ ఉప్పు పరిశ్రమ ఒకప్పుడు దేశంలోనే మూడోస్థానంలో ఉండేది. అటువంటి ఉప్పు పరిశ్రమకు మూలపేటలో పోర్టు కారణంగా గండం ఏర్పడింది. సంతబొమ్మాళి మండలంలో నౌపడ, సీతానగరం, మూలపేట, యామాలపేట, భావనపాడు, మర్రిపాడు, శలగపేట తదితర గ్రామాల పరిధిలో సుమారు 5వేల ఎకరాల ఉప్పు భూములు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం 293.97 ఎకరాలను మూలపేట పోర్టు కోసం అధికారులు సేకరించారు. అలాగే పోర్టు చుట్టూ ఏర్పడనున్న అనుబంధ పరిశ్రమలు, భవిష్యత్‌లో పోర్టు విస్తరణకు వేల ఎకరాల్లో భూములు కావాల్సి ఉంది. దీంతో మిగిలిన ఉప్పు భూములను కూడా సేకరించే అవకాశం ఉంది. దీనివల్ల నౌపడా శివార్లలో ఉన్న అరకొర ఉప్పు భూములు మాత్రమే మిగలనున్నాయి. ఈ ప్రాంతంలో పండే ఉప్పు కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం నౌపడా కేంద్రంగా సాల్ట్‌బోర్డు కమిషన్ కార్యాలయాన్ని సైతం మొన్నటి వరకు నిర్వహించింది. ఇప్పటికే కొంత మేర ఉప్పు భూములు రొయ్యల చెరువులుగా మారాయి. మిగిలిన భూములను మూలపేట పోర్టు భవిష్యత్ అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీ, చెన్నైలోని సాల్ట్‌బోర్డులతో చర్చలు నిర్వహించింది. ఈ వ్యవహారం ఇంకా కొలిక్కి రావాల్సి ఉంది. ఉప్పు భూముల్లో కొంతభాగం 2027వ సంవత్సరం వరకు తమకు లీజులు ఉన్నాయని ఇప్పటికే కొందరు కోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ యంత్రాంగం అవన్నీ పక్కనపెట్టి పోర్టు నిర్మాణానికి అవసరమైన రైలు, రోడ్డు మార్గాలు కోసం కొంతమేరకు భూములను స్వాధీనం చేసుకొని పనులు మొదలుపెట్టింది. ఒకప్పుడు నౌపడా ప్రాంతంలో 286 మందికి లీజులు ఉండగా, ఇప్పుడు ఆ పరిస్థితి కనుమరుగైంది. మరోవైపు ఉప్పుపంట ఆదాయం తగ్గడంతో రైతులు సైతం ఆందోళనలో పడ్డారు. ఈ విషయమై ఆర్డీవో ఎం.కృష్ణమూర్తిని వివరణ కోరగా.. 'పోర్టు అవసరాల కోసం నౌపడా ఉప్పు భూములు సేకరించనున్నాం. కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడి అవసరం మేరకు ఉప్పు భూములను తీసుకుంటామ'ని తెలిపారు.



ఉప్పు బస్తాలు



నౌపడలో ఉప్పు సాగు

శిలగాంలో డ్వాక్రా రుణాల కుంభకోణం

- బ్యాంకు అధికారుల చేతివాటం
- ఆలస్యంగా వెలుగులోకి..

కవిటి, మే 5(ఆంధ్రజ్యోతి): కవిటి మండలం శిలగాంలోని ఓ బ్యాంకులో 2021లో జరిగిన రుణాల కుంభకోణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహిళా సంఘాలకు అందించే రుణాల పేరిట జరిగిన ఈ కుంభకోణంలో సూత్రధారుల పాత్ర బయట పడకపోవడంతో నాలుగేళ్లుగా ఈ వ్యవహారం కొనసాగుతోంది. రెండు రోజుల కిందట రాజకీయ కారణాలతో ఈ విషయం మళ్లీ చర్చనీయాంశమవుతోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే ముగ్గురు బ్యాంకు అధికారులను సస్పెన్షన్ చేశారని తెలుస్తోంది. శిలగాంలోని బ్యాంకు పరిధిలో 2021లో మహిళా సంఘాలకు అందించే రుణాలను బ్యాంకు అధికారులే సొంతానికి వాడుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బ్యాంకు లావాదేవీల్లో కూడా సొమ్ము తారుమారు చేశారనే విమర్శలున్నాయి. మహిళా సంఘాలకు తక్కువ వడ్డీకే లక్షలాది రూపాయలు రుణాలు మంజూరు చేస్తామని ఆశ కల్పించారు. బ్యాంకు పరిధిలోని బెలగాం, జాడుపూడి ఆర్ఎస్ గ్రామాల్లో డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు చేశారు. ఈ సమయంలో కొంతమంది బ్యాంకు అధికారులు సీఎఫ్‌తో కలిసి.. చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పటి బ్యాంకు మేనేజర్, క్యాషియర్, అసిస్టెంట్ మేనేజర్లు రూ.32లక్షలు సొంతానికి వాడుకున్నారని సమాచారం. మహిళా సంఘాలకు మంజూరు చేసే రుణాలను వారు సొంతానికి వాడుకుని.. దశలవారీగా సంఘాల ఖాతాలకు విడుదల చేసేవారు. 2022లోనే ఈ వ్యవహారంపై బయటపడడంతో కొంతమంది పెద్దల సమక్షంలో రూ.18 లక్షలను రికవరీ చేశామని ఏపీఎం గోవింద్ తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల మంజూరు వ్యవహారంలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. సంబంధిత సీఎఫ్‌ను అప్పుడే తొలగించామని తెలిపారు.

- తాజాగా బ్యాంకు లావాదేవీల్లో మరికొంత మేర సొమ్ము చేతులు మారినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ బ్యాంకులో కొందరు ఖాతాదారుల సొమ్ము మాయమైనట్లు భోగట్టా. అలాగే మహిళా సంఘాల పేరిట బినామీ ఖాతాలు తెరిచి వారికి రుణాలు ఇచ్చినట్టుగా నమోదు చేసి సొమ్మును మాయం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బ్యాంకులో గతంలో విధులు నిర్వహించిన అధికారులతోపాటు పెద్ద తలకాయలున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ వ్యవహారంలో నాలుగేళ్ల కిందట పోలీసులకు బ్యాంకు అధికారులు ఫిర్యాదు చేశారని కవిటి ఎస్ఐ రవివర్మ తెలిపారు. దీనిపై బ్యాంకు ఉన్నతాధికారులు విచారణ నిర్వహిస్తున్నారని, అప్పట్లో పనిచేసిన ముగ్గురు బ్యాంకు అధికారులు సస్పెండ్ అయ్యారని వెల్లడించారు.

గ్రీవెన్స్‌లో కలకలం

- ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వృద్ధురాలు
- భూ సమస్య పరిష్కరించాలంటూ ఆవేదన
- అప్రమత్తమై రక్షించిన మహిళా పోలీసు
- తక్షణ చర్యలకు ఆదేశించిన కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి): 'పద్నాలుగేళ్లుగా న్యాయం కోసం పోరాడుతూనే ఉన్నాను. ఐదేళ్లుగా సమస్య పరిష్కారానికి స్పందన(గ్రీవెన్స్) కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి వినతులు అందజేస్తూనే ఉన్నాను. ప్రాణం విసిగిపోయింది. ఆశ అంతరించింది. ఇక చావే శరణ్యం' అంటూ ఓ వృద్ధురాలు జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీకోసం'(గ్రీవెన్స్) కార్యక్రమంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే..

శ్రీకాకుళంలోని బాకర్ సాహెబ్‌పేటకు చెందిన లొట్టి మంగమ్మ(65), ఆనందరావు దంపతులకు.. వారసత్వంగా పాత్రునివలస, బలగ రూరల్ రెవెన్యూ పరిధిలో 2011లో కోర్టు డిక్రీ ద్వారా కొంత భూమి సంక్రమించింది. కానీ వారి బంధువులు ఈరోజు వరకు ఆ భూమిని ఇవ్వలేదు. న్యాయప్రకారం ఆ భూమిని అందజేసి సమస్యను పరిష్కరించాలని వారు ఐదేళ్లుగా కలెక్టర్ 'స్పందన' కార్యక్రమంలో వినతులు సమర్పిస్తున్నారు. కానీ ఇంతవరకు న్యాయం జరగకపోవడంతో సోమవారం మంగమ్మ జడ్పీలో 'మీకోసం'(గ్రీవెన్స్) కార్యక్రమానికి హాజరైంది. సంచిలో రూ.50 పెట్రోలు నింపిన సీసాను, ఆహారపొట్లాన్ని తీసుకువచ్చింది. తాను తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా భూ సమస్య పరిష్కారం కావడం లేదని, తమకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసింది. అనంతరం అదే ప్రాంగణంలో ఒక మూలకు వెళ్లి తనతో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని మళ్లీ కలెక్టర్ (మిగతా 8వ పేజీలో..)

- ఘటనపై కలెక్టర్ మాట్లాడుతూ ఆస్తి తగాదా వారి కుటుంబ సభ్యుల మధ్యనే జరుగుతోంది. కింది కోర్టులో ఫిర్యాదు చేసిన మంగమ్మకు మొత్తం ఆస్తిలో 1/7వంతు భాగం వాటాగా ఇవ్వాలని కోర్టు డిక్రీ 2011లో తీర్పు వచ్చింది. దీనిపై అవతలి పార్టీ వారు హైకోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. అయితే పాత డిక్రీ ప్రకారం ప్రస్తుతం శ్రీకాకుళం తహసీల్దారుకు, ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పోలీసులకు సమస్య పరిష్కరించాలని ఆదేశించాం. హైకోర్టు తీర్పు వచ్చాక అందుకు అనుగుణంగా ఇప్పుడు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

- ఇప్పటికైనా న్యాయం జరిగింది

'2011లో కోర్టు తీర్పు మాకు అనుకూలంగా వచ్చినా సరే ఇప్పటికీ మా వాటా భూమిని మాకు అందజేయలేదు. దీనికోసం ఇన్నాళ్లూ పోరాడుతూనే ఉన్నాం. తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాం. కానీ ప్రయోజనం శూన్యం. ప్రాణం విసిగిపోయింది. అందుకే సంచిలో పెట్రోలు తీసుకుని వచ్చా. పోలీసులు సంచిని పరీక్షించి, ఏమిటి ఇది అని అడగ్గా కూల్‌డ్రింక్, ఆహార పొట్లాం తీసుకువచ్చానని వారితో చెప్పాను. పెట్రోలు ఒంటిపై పోసుకుని, చనిపోదామనుకున్నాను, కానీ ఆ మహిళా పోలీసు వెంటనే గమనించి, నన్ను ప్రాణాలతో రక్షించింది. కలెక్టర్ నా సమస్యను అర్థం చేసుకుని న్యాయం చేశారు. ఆనందంగా ఉంది. కలెక్టర్‌గారు చల్లగా ఉండాలి' అని మంగమ్మ పేర్కొన్నారు.



మంగమ్మతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రోడ్లకు మరమ్మతులు చేపట్టండి

- వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకూడదు
- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

8లో

'వంశధార'తో నీటి సమస్య పరిష్కరించాం

- ప్రభుత్వ విప్ అశోక్

7లో

అయినా... బెల్ట్ మానలేదు

- జిల్లాలో పట్టుబడుతున్న అక్రమ మద్యం
- తాజాగా సంచాంలో పెద్ద ఎత్తున స్వాధీనం

ఓపీఎస్ అమలు చేయాలి

- జిల్లావ్యాప్తంగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు

7లో

రాజుల చెరువు బాగుపడేనా?

- ఆక్రమణలతో ఆనవాళ్లు కోల్పోయిన వైనం
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రజల వినతి

నరసన్నపేట, మే 5(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నడిబొడ్డున సుమారు 13 ఎకరాల్లో విస్తరించి ఉన్న రాజుల చెరువు రోజురోజుకూ ఆనవాళ్లు కోల్పోతోంది. పట్టణంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సుమారు 200ఏళ్ల కిందట జమీందారులు పాలనలో నిర్మించిన ఈ చెరువు ఆక్రమణకు గురవుతోంది. 50 ఏళ్ల కిందట వరకూ పట్టణ ప్రజలకు ఇదే తాగునీటి వనరు. ప్రస్తుతం ఆక్రమణలతోపాటు చెరువులో నీరు కాలుష్యం కావడంతో తాగునీరుకు పనికిరాకుండా పోయింది. దీంతో నరసన్నపేట మేజర్ పంచాయతీకి దేవాది నుంచి తాగునీరు తీసుకురావల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్తీకమాసంలో దీపాల వెలుగులో రాజులు చెరువు వెలిగిపోయేదని అప్పటి పెద్దలు చెబుతున్నారు. అప్పట్లో చెరువులో స్నానమాచరిస్తే రోగాల నయమవుతాయని ప్రజల్లో నమ్మకం. రానురాను ప్రజలు ఈ చెరువును వాడకపోవడంతో పట్టణంలో డ్రైనేజీల నుంచి వచ్చేనీటితో మురికి స్థావరంగా మారింది. మరోవైపు చెరువుగట్టుపై అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. గట్టుపై గల ఇళ్లలోని వ్యక్తిగత మరుగుదొడ్లకు కనెక్షన్ నేరుగా చెరువులో (మిగతా 8వ పేజీలో..)



ఆక్రమణలతో రాజులచెరువు ఇలా..

ఇవేం పనులు?

- పాఠశాల నిర్మాణానికి నాసిరకం ఇటుకల వినియోగం
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మెళియాపుట్టి, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా.. కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేపడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకే మళ్లీ పనులు అప్పగించడంతో నాణ్యత పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మెళియాపుట్టి మండలం చాపర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు 30 ఏళ్లుగా ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి హామీ నిధులను రూ.50లక్షలు మంజూరు చేసింది. ఈ పనులను ఒక నాయకుడు బంధువుకు కాంట్రాక్ట్ అప్పగించారు. కాగా.. గోడ నిర్మాణానికి సిమెంట్ ఇటుకలను వినియోగించాల్సి ఉండగా.. నాణ్యత లేనివి వినియోగిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ సమయంలో ఇటుకల నుంచి సిమెంట్ పిండి మాదిరి రాలిపోతోందని పేర్కొంటున్నారు. ఇటీవల సింహాచలం దేవస్థానంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతిచెందిన విషయం తెలిసిందే. అటువంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే పాఠశాలలోని నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో ప్రసాద్ పండా వద్ద ప్రస్తావించగా.. 'చాపర జిల్లాపరిషత్ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను సర్వశిక్షా అభియాన్ అధికారులు చేపడుతున్నారు. పనులను పరిశీలించి.. నాణ్యతాలోపం ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.



చాపరలోని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యత లేని ఇటుకలతో నిర్మించిన ప్రహరీ

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



మాట్లాడుతున్న ఎన్ఈఆర్

రణస్థలం, మే 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం రణస్థలంలోని ఎన్ఈఆర్ క్యాంపు కార్యాలయంలో బీజేపీ క్రియాశీలక కార్యకర్తల సమావేశం అసెంబ్లీ కన్వీనర్ నడుకుదిటి రజిని ఎన్ఈఆర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ శ్రేణులు నిరంతరం ప్రజల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సంపతరావు నాగేశ్వరరావు, నాలుగు మండలాలపార్టీ అధ్యక్షులు లుకలాపు అప్పలనాయుడు, మహంతి అనంత్, ఫైల విష్ణుమూర్తి, సనపల రామారా వు, జీరు రామారావు, పీవీ రత్నం, ఆకెళ్ల సూరిబాబు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలలో విజయానికి తోడ్పడాలి

● ఆమదాలవలస టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు చంద్రశేఖర్

పొందూరు, మే 5 (ఆంధ్రజ్యోతి):పార్టీని బూత్‌స్థాయినుంచి మరింత బలోపేతం చేసే బాధ్యత ప్రతికార్యకర్త, నాయకుడు తీసుకోవాలని ఆమదాలవలస నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చంద్రశేఖర్ కోరారు. సోమవారం పొందూరులో టీడీపీనాయకులతో చర్చించారు.ఈసందర్భంగా పలువురునాయకులు పార్టీ, ప్రభుత్వపరంగాఉన్న సమస్యలను పరిశీలకులు దృష్టికి తీసుకువెళ్లారు.ఐకంగా త్వరలో జరిగే స్థానికసంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మం డలాధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, నాయకులు కూన సత్యనారాయణ, బలగ శంకరభాస్కర్, సీపాన శ్రీరంగనాయకులు, బాడాన గిరి, వరదరాజులు, భాస్కరరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

ఆమదాలవలస, మే 5 (ఆంధ్రజ్యోతి):వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ చిల్లర, చౌకబారు రాజకీయాలు మానుకోవాలని ఎనిమిదో వార్డు టీడీపీ ఇన్‌చార్జి దవళఅప్పలనాయుడు కోరారు. సోమవారం ఆమదాలవలస టీడీపీ కార్యాలయంలో ఎనిమిదో వార్డుకు చెందిన బి.మహేష్‌సాయి, చిన్నకిరణ్‌కు కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఎనిమిదో వార్డుకు చెందిన నలుగురు యువకులు వైసీపీలో చేరినట్టు పత్రికల్లో వచ్చిన కథనాలు అవాస్తవమని, వారిని వైసీపీ నాయకులు మభ్యపెట్టి కండువాలు వేసి పార్టీలో చేరినట్టు ప్రకటించారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన కోడిగుడ్లు సరఫరా

పొందూరు, మే 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొంచాడ పంచాయతీ పరిధిలోగల గొళ్లకొంచాడ (చినకొంచాడ) అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన కోడి గుడ్లు సరఫరా అవుతుండడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఉడకబెట్టిన తర్వాత గుడ్లు పాడవుతున్నాయనివాపోతున్నారు.ఈవిషయాన్నిమాజీ సర్పంచ్ ఎం.తవిటినాయుడు సీడీపీవో రాధారాణి దృష్టికి తీసుకువెళ్లారు.కాగా కుళ్లిన కోడిగుడ్లు సరఫరాపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీడీపీవో తెలిపారు.

డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్

ఆమదాలవలస,మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీఎస్సీకి సిద్ధమయ్యే అభ్యర్థులకు సలహాలు, సూచనలు కావాలన్నా ఉచితంగా ఇవ్వనున్నట్లు వజ్రపుకొత్తూరు బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకుడు, కొర్లకోట గ్రామానికి చెందిన అంపోలు రాజేష్ ఒకప్రకటనలో తెలిపారు. ప్రత్యేక మెటీరియల్‌ను ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఇచ్ఛాపురంలో జాబ్ మేళా

ఇచ్ఛాపురం, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివిస్ కెమికల్ కంపెనీ సోమవారం నిర్వహించిన జాబ్ మేళాకు 15 మంది విద్యార్థులు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్ కుమార్ పాడి తెలిపారు. ఈసందర్భంగా వారికి రాత పరీక్ష నిర్వహించారని, ఎంపికైన విద్యార్థుల వివరాలు త్వరలో ప్రకటిస్తరని చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ సీహెచ్ పూర్ణచంద్రరావు, జాబ్‌డ్రైవ్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫాక్సికన్ మేన్‌ఫ్యాక్చరింగ్ కంపెనీ బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్‌కుమార్‌పాడి ఒకప్రకటనలో తెలిపారు. మేళాకు బీఏ, బీకాం, బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

శ్రీకాకుళంలో రామనామ దశకోటి మహాయజ్ఞం

శ్రీకాకుళంకల్చరల్, మే 5(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉప నిస్సందిరం ఆధ్వర్యంలో శ్రీరామనామ దశకోటిమహాయజ్ఞ శ్రీమనుమాన్ చాలీసాకోటి పారాయణం, మహా యజ్ఞం, పూర్ణాహుతి మహోత్సవాలు సోమవారం కూడా నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కరబాట్ల శ్రీరామశర్మ, నీరజా సుబ్రహ్మణ్యం, పీవీ రమణమూర్తి, విశ్వనాథం కామేశ్వరరావు, కనుగుల సత్యం, బండారు వెంకట లక్ష్మి, నేరెళ్ళ విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్,మే 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని మంగువారితోటలో గల సంపత్ వినాయక ఆలయంలో 13వ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధి బుద్ధి వినాయకుడికి ప్రత్యేక ంగా అలంకరించారు. ఈ సందర్భంగా బుక్కురు వెంకటేశ్వరరావు దంపతులు పూజలు నిర్వహించారు.

పీఎండీఎస్ కిట్ల తయారీ

బూర్జ, మే 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పాలవలసలో ఏవో శ్రీనివాసరావు, కొత్తూరు డివిజన్ ఇన్‌చార్జి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో వరి పంటలో నవధాన్యాల సాగుకు అవసరమైన ఐదుకేజీల పరిమాణం గల వెయ్యి పీఎండీఎస్ కిట్లు సోమవారం తయారు చేయించారు. ఈ సందర్భంగా నవధాన్యాల వల్ల కలిగే ఉపయోగాలను వివరించి, రైతులకు పీఎండీఎస్ కిట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంటీలు చిన్నమ్మడు, సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌చార్జి జనార్దనరావు, సీడీఐ శ్రావణి, ఐసీఆర్పీలు తవిటినాయుడు, గణపతి, శంకర్, వరలక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల కుటుంబాలకు పరామర్శ

రణస్థలం,మే 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని వేల్పురాయి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బాలి సింహాచలం, అడపాశ్రీను కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో బాలి సింహాచలం, అడపాశ్రీను మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు సింహాచలం అంత్యకియలు సోమవారం వెల్పురాయిలో జరిగాయి. ఆయన పార్థివదేహానికి ఎమ్మెల్యే నడు కుదిటి ఈశ్వరరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలి శ్రీనివాసరావు,బాలిరామినాయుడు, కలిశెట్టి కన్నంనాయుడు, పాల్గొన్నారు.

యూట్యూబర్‌పై ఎస్పీకి ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఓ యూట్యూబర్ డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని ఎస్పీకి ఫిర్యాదు అందింది. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జేఎై విద్యాసంస్థల కరస్పాండెంట్ శంకరరావు ఫిర్యాదు చేశారు. జిల్లాకు చెం దిన ఓ యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు తన స్కూల్‌పై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, తనను డబ్బులు డిమాండ్ చేశారని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కొన్ని ఆధారాలను ఎస్పీకి అందజేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేర పరిశోధనలో ఫోరెనిక్స్ ఆధారాలే కీలకం

శ్రీకాకుళం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి):నేర పరిశోధనలో ఫోరెనిక్స్ ఆధారాలే కీలకమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం శ్రీకాకుళం రూరల్ మండలంలోని మునసబ్‌పేట గాయత్రీ విద్యా సంస్థలో ఫోరెన్సిక్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాలపై కోర్టుల్లో శిక్షపడాలంటే శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తు జరగాలని తెలిపారు. ప్రతి దర్యాప్తుఅధికారి, పోరెనిక్స్ భౌతిక ఆధారాల సేకరణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఎస్ఐ కె.రాము, ఫోరెనిక్స్ నిపుణులు పాల్గొన్నారు.

వినతులను పరిష్కరించండి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



గ్రీవెన్స్‌లో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే5(ఆంధ్రజ్యోతి): మీకోసంలో వచ్చిన వినతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట సమయంలోగా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన మీకోసం కార్యక్రమంలోజిల్లా నలుమూలల నుంచి వచ్చినవారి నుంచి 154అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అర్జీలను పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. కిందిస్థాయి అధికారులపై ఆధారపడకుండా ఉన్నతాధికారులే క్షేత్రస్థాయికి వెళ్లాలని కోరారు.ప్రతిఅర్జీకి సత్వర న్యాయం చేకూర్చడమే లక్ష్యమని తెలిపారు. కాగా డిగ్రీఆపైన చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు విభిన్నప్రతిభావంతులశాఖ ఆధ్వర్యంలో ఐదు ల్యాప్‌టాప్‌లు, టచ్‌ఫోన్ కలెక్టర్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సహాయకలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఉపకలెక్టర్ పద్మావతి, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా పాల్గొన్నారు.

పింఛన్ మంజూరుచేసి ఆదుకోండి

తమకు పింఛన్‌మంజూరుచేసి ఆదుకోవాలని రణస్థలం మండలంలోని జీరుపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగ అక్కాతమ్ముళ్లు సూరాడ సంతోషి, శ్రీరామ్ కోరారు. వారిద్దరూ పుట్టుకతో దివ్యాంగులు కావడంతో మంచానికి పరిమితమయ్యారు. దీంతో కుటుంబసభ్యులు సపర్యలు చేయాల్సివస్తోంది. దీనితోడు పేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో తమకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశం మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు విన్నవించారు.

హెచ్ఎం, డీఈవోలను సస్పెండ్ చేయాలి

తమ కుమారుడు కంటిచూపు కోల్పోవడానికి కారకులైన ఉపాధ్యాయుడు నగిరిఅరుణ్‌కుమార్, తప్పుడు సమాచారం ఇచ్చిన హెచ్ఎం టి.శోభారాణి, డీఈవోను సస్పెండ్ చేయాలని బాధితుడు చెన్నాకుమార్ కుటుంబసభ్యులు కోరారు. పైడిభీమవరం జడ్పీహెచ్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న చెన్నాకుమార్ గతఏడాది అక్టోబరు పదోతేదీన కంటి చూపు కోల్పోయిన విషయం విదితమే. ఈనేపథ్యంలో న్యాయం చేయాలని గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు కుటుంబ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఘటనకు కారకులైన వారిపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదని, చికిత్సనిమిత్తం ఆర్థిక సహాయం చేయాలని డీఆర్వో నివేదిక ఇచ్చినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. చెన్నాకుమార్ చదువు, ఆరోగ్యం, భవిష్యత్తుకు ప్రభుత్వమే సహకరించాలని కోరారు.

వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై గోడపత్రిక ఆవిష్కరణ

స్థానిక జడ్పీ కార్యాలయంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, సేవలపై అవగాహన కల్పించేందుకు గోడ పత్రికను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఆవిష్కరించారు. ఈసేవల ద్వారా ప్రజలు 9552300009 నెంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్‌పంపి లైసెన్స్‌లు, పన్నులు, రసీదులు, పరీక్ష ఫలితాలు, టికెట్ బుకింగ్ వంటి 200పైగా ప్రభుత్వ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు.

కోతకు గురవుతున్న ప్రాంతాల్లో గోడలు నిర్మించాలి

అరసవల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలంలోని కుందువానిపేట, పెద్ద గనగళ్లవానిపేట వద్ద సముద్రపు అలల తాకిడికి కోతకు గురవుతున్న ప్రాంతాల్లో గోడ నిర్మించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు.ఈమేరకు స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో చర్చించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

‘వంశధార’తో నీటి సమస్య పరిష్కరించాం

● ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్



వంశధార జలాలు విడుదల చేస్తున్న అశోక్

ఇచ్ఛాపురం, మే 5(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాజెక్ట్ ద్వారా బాహుదాకు వంశధార నీరందించి మునిసిపాలిటీలో నీటి కొరత సమస్య పరిష్కరించామని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురంలోని సంతపేట పంప్ పంప్‌హౌస్ వద్ద ఉద్దానం ప్రాజెక్ట్‌కు చేరిన వంశధార జలాలను వాల్ ఓపెన్ చేసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఐఐబీ ప్రాజెక్ట్‌కు రూ.62కోట్లు మంజూరుకావడంతో త్వరలో పనులు ప్రారంభించి మునిసిపాలిటీలోని 23వార్డులకు ఇంటింటా కుళాయిల ద్వారా తాగునీరందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, ఈఈ సుగుణకారరావు, కమిషనర్ ఎన్.రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ యాదవ్, పట్టణ కార్యదర్శి నందికి జాని, కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, ఆశీ లీలారాణి, నాయకులు శేఖర్, కృష్ణయ్య, కొరాయి ధర్మరాజు, రెయ్యి జానకిరావు, జన్నెల సంతోష్ పాల్గొన్నారు.

నేటి నుంచి సిరిమానోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి):పాత శ్రీకాకుళంలో మంగళవారం నుంచి సిరిమానోత్సవాలు నెలరోజులపాటు నిర్వహించను న్నారు. ఈ మేరకు నిర్వాహకులు, పెద్దమ్మవారు ఆలయ కమిటీ అధ్య క్షుడు డీపీదేవ్, ఎల్.రామలింగేశ్వర స్వామి, మావూరు శేఖర్, నక్క శంకరరావు, కోళ్లపల్లి సోంబాబు, కర్రి రంగాజీ దేవ్, దేశెళ్ళ గో విందా మల్లిబాబు విలేకరులతో మాట్లాడారు. జూన్ పదో తేదీన ఉత్సవాలు అనుపో త్సవం తో ముగుస్తాయనితెలిపారు.పాతశ్రీకాకుళంలోని ముత్యాలమ్మ, నక్క వీధిలోని నూకాలమ్మ, సంతోషిమాత జంక్షన్‌లోని దుర్గమ్మ, మావూరు వీధిలోని పెద్దమ్మతల్లికొత్తపేటవద్ద ఉన్న సన్నాల పోలమ్మ అమ్మవార్లకు పూజలు, సిరిమా నోత్సవాలు 36 రోజులపాటు నిర్వహించ నున్నట్లు తెలిపారు. జడ్పీ నుంచి దేశెల్ల వీధి, నక్కవీధి, దండివీధి, సంతోషిమాతా జంక్షన్ మావూరువీధి, కలెక్టర్ బంగ్లా హరిజనవీధి, బాదుర్లపేట, కొత్తపేట, కునుకు పేట వరకు వెళ్లి తిరిగి కుందనపు పేట మీదుగా జడ్పీ జంక్షన్ వరకు సిరిమాను ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

అయినా... బెల్ట్ మానలేదు

● జిల్లాలో పట్టుబడుతున్న అక్రమ మద్యం

● తాజాగా సంచాంలో పెద్ద ఎత్తున స్వాధీనం

రణస్థలం, మే 5 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో బెల్ట్ షాపులకు అవకాశం లేదు. ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహించినా.. అధిక ధరలకు మద్యం అమ్మినా చర్యలు చేపడతాం.సంబంధిత షాపుల లైసెన్సులు రద్దు చేస్తాం'.. సీఎం చంద్రబాబు ప్రకటన ఇది. కానీ క్షేత్ర స్థాయిలో అందుకు విరుద్ధంగా పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలో ఏదో ఒకచోట అక్రమంగా మద్యం విక్రయించడం పరిపాటిగా మారింది. ముందస్తు సమాచారం మేరకు జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి సంచాం గ్రామం జంక్షన్ వద్ద బైక్‌పై వస్తున్న మీసాల రాము, గంట్యాడ సాయిరామ్, బి.గణేష్ అనే వ్యక్తులను ఆదివారం రాత్రి తనిఖీచేశారు. వీరినుంచి 193 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.35 వేలు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేశారు. వైసీపీహయాంలో ప్రభుత్వ మద్యందుకాణాలు నడిచేవి. నాసిరకం మద్యంతోపాటు అధిక ధరలకు విక్రయించేవారు. దీంతో సరిహద్దు రాష్ట్రాల మద్యంతో పాటు పెద్ద ఎత్తున సారా వినియోగం పెరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి మారింది. జిల్లా వ్యాప్తంగా 158 మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. ప్రైవేటు వ్యక్తులకు కేటాయించడంతో ఇక బెల్ట్ షాపులు ఉండవని ప్రభుత్వం భావించింది. ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహించి నా.. మద్యం దుకాణాల నుంచి సరఫరా చేసినా అనుమతులు రద్దు చేస్తా మని తీవ్రస్థాయిలో హెచ్చరించింది ప్రభుత్వం. కానీ కొందరు వ్యాపారులు పెడచెవిన పెడుతున్నట్టు ప్రచారం నడుస్తోంది. తాజాగా సంచాం గ్రామం వద్ద పెద్ద ఎత్తున మద్యం పట్టుబడడమే ఇందుకు ఉదాహరణ.

ఓపీఎస్ అమలు చేయాలి

● విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించాలి

● జిల్లావ్యాప్తంగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు



శ్రీకాకుళం రూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పాత పింఛన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని, పాఠశాలలను పరిరక్షించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. సోమవారం జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద విద్యా, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు.

●శ్రీకాకుళం రూరల్ మే 5(ఆంధ్రజ్యోతి): విద్యా, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ కోరారు. శ్రీకాకుళంలోని తహశీల్దార్‌కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించి,తహసీల్దార్ గణపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మోహనరావు, నవీన్‌కుమార్ శంకరరావు, త్రినాథరావు, ప్రసాద్, వేణుగోపాల్, రామారావు పాల్గొన్నారు.

●పొందూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ నియమించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పొందూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి, తహసీల్దార్ ఆర్. వెంకటేష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పొందూరు, జి.సిగడాం మండలాల ఏపీటీఎఫ్ నాయకులు కె. విజయ్‌కుమార్, తిరుమలరావు, రంగారావు, తేజేశ్వరరావు పాల్గొన్నారు.

●సోంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి వరకూ కొనసాగించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు.ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రంలో సంఘ ప్రతినిధులు జీ.భీమారావు, గార రాజేష్, కే.పాపారావు, జీ.తిరుపతిరావు పాల్గొన్నారు.

●ఆమదాలవలస, మే 5 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పేడాడ అప్పలనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాంబాబుకు వితినపత్రం అందించారు. కార్య క్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు బి.చంద్రశేఖర్, టి.సూర్యనారాయణ, బి.సుందరరావు, మహేష్, రామన్న, విశ్వనాధం, సత్యనారాయణ, రమణ, పి.సూర్యనారాయణ, పి.అప్పారావు పాల్గొన్నారు.

●టెక్కలి/పలాస రూరల్, మే5(ఆంధ్రజ్యోతి):విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. టెక్కలి, పలాస తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్లు రవికుమార్, కల్యాణ చక్రవర్తిలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్‌ప్రతినిధులు శ్రీనివాసరావు, బాబూరావు, బల్ల సుభాష్‌బాబు, అనూరాధ, ధనుంజయరెడ్డి, పలాస మండల అధ్యక్షుడు రామునాయుడు, వజ్రపుకొత్తూరు మండల ప్రధాన కార్యదర్శి వెంకటరావు పాల్గొన్నారు.

వినతులకు ప్రాధాన్యం ఇవ్వండి: ఎస్పీ



వృద్ధుల వద్దకు వెళ్లి ఫిర్యాదును స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కార్యక్రమంలో వచ్చే వినతులకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఎటువంటి ఆలస్యానికి తావులేకుండా పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి 45 పిర్యాదులను స్వీకరించారు.వారి సమస్యలను తెలుసుకుని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసాఇచ్చారు. ఫిర్యాదుల వివరాలను జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యానికి తావు లేకుండా, త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు.ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలోగా జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఏఎస్పీరమణ పాల్గొన్నారు.

జాబ్‌చార్ట్ అమలుచేయాలి

● శ్రీకాకుళంలో కమ్యూనిటీ హెల్త్ అధికారుల నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీహెచ్‌వోలు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి): ఆరు సంవత్సరాలు సర్వీసు పూర్తయిన వారిని రెగ్యులర్ చేయాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన పెంచాలని, జాబ్ చార్టు అమలుచేయాలని కమ్యూనిటీ హెల్త్ అధికారులు(సీహెచ్‌వో) కోరారు.ఈమేరకు సోమవారం శ్రీకాకుళంలోని జ్యోతిరావుపూలే పార్కు వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని సీహెచ్‌వోలు కళ్లకు గంతలు కట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. వీరికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు తమ మద్దతు తెలియజేశారు.

అరసవల్లిలో ఫుట్‌బ్రిడ్జి నాణ్యత పరిశీలన

అరసవల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): అర సవల్లి సూర్యనారాయణ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ఫుట్ బ్రిడ్జి నిర్మాణాన్ని నాణ్యతను దేవదాయ శాఖ ఇంజినీర్లు సోమవారం పరి శీలించారు. విశాఖపట్నంలోని కనకమహా లక్ష్మి ఆలయ ఈఈ సీహెచ్ రమణ, ఏఈ చందన బ్రిడ్జి పటిష్టతను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టరు పాపారావుకు బ్రిడ్జి పటిష్టతకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఎస్ కనకరాజు, జగన్మోహనరావు, సాయి పాల్గొన్నారు.

45 మద్యం సీసాల స్వాధీనం

ఎచ్చెర్ల, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతలకోడూరు గ్రామానికి చెందిన ఇప్పిలి కోటేశ్వరరావు తన పాన్‌షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 45 మద్యం సీసాలను సోమవారం ఎచ్చెర్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలికకు గాయాలు

కవిటి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ కపాసుకుద్దిలో విద్యుదాఘాతానికి గురైన బాలిక ఎం.తులసికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం మేరకు..గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పక్కనుంచి సోమవారం సాయంత్రం తులసి నడుచుకొని వెళ్తోంది. ఆ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నీరు నిల్వ ఉండడంతో అందులో కాలుపడడంతో వెంటనే విద్యుదా ఘాతానికి గురైంది. దీంతో బాలికను కవిటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి బరంపురం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రణస్థలం, మే 5(ఆంధ్రజ్యోతి): కొండములగాం గ్రామ సమీపంలో రామతీర్థం రోడ్డుపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఉపాధిహామీ పనులు చేసుకొని ద్విచక్రవాహనంపై ముగ్గురు వస్తున్నారు. రామతీర్థం రోడ్డు మీదకు వచ్చే క్రమంలో రణస్థలం వైపు వస్తున్న ఆటో ఢీ కొంది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఎం.మహాలక్ష్మి, వి.మణికంఠ, ఎం.వెంకట రమణ, ఆటో డ్రైవర్ ఎం.రమణకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 సిబ్బంది శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్. చిరంజీవి కేసు నమోదు చేశారు.

తురకశాసనాం వద్ద తాపీ మేస్త్రీకి..

సోంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తురక శాసనాం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబుగాం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. సోంపేట నుంచి అంబుగాం వెళ్తున్న తాపీమేస్త్రీ తురకశాసనాం జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టి పక్కనే ఉన్న ముళ్లపొదల్లో పడిపోయాడు. స్థానిక యువత స్పందించి వెంటనే ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

టెక్కలి, మే 5(ఆంధ్రజ్యోతి): నౌపడా రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ట్రాక్ పక్కన 38 నుంచి 40 ఏళ్ల లోపు వయసున్న వ్యక్తి సోమవారం మృతి చెంది నట్లు సమాచారం వచ్చిందని ఎస్‌ఐ రాము తెలిపారు. వ్యక్తి కుడి చేయిపై సంజయ్ అని పచ్చబొట్టు రాసి ఉందని, ఎవరైనా గుర్తిస్తే 63099 90860 నెంబరుకు తెలియజేయాలన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ ఐటీఐ స్థలం కబ్జాకు యత్నం


ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

పలాస, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఇద్దరు ప్రయత్నించగా ప్రిన్సిపాల్, సిబ్బంది అడ్డుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. దివంగత ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం సర్వే నెంబరు 232/2ఎ3లో 3.27 ఎకరాల స్థలంలో రూ.5 కోట్ల వ్యయంతో ప్రైవే టు ఐటీఐ నిర్మించారు. ఆ తరువాత దానిని ప్రభుత్వానికి ఉచితంగా అప్పగించారు. ఈ స్థలాలను ఆక్రమిం చేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. తప్పుడు సర్వే నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేయిస్తూ.. ఈ స్థలాలు మావేనంటూ నిత్యం ఘర్షలకు దిగుతుండడంతో ఐటీఐ సిబ్బంది ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఇద్దరు వ్యక్తులు ఎక్స్‌కవేటర్ సాయంతో స్థలాన్ని చదును చేస్తున్న విషయం తెలు సుకున్న ప్రిన్సిపాల్ పైల జవహర్, సిబ్బంది సదరు ప్రయత్నాన్ని అడ్డుకు న్నారు. స్థలం కబ్జా ప్రయత్నం విషయమై కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఐటీఐ భవనాలకు రక్షణ గోడ లేకపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఘటాల ఊరేగింపు

నరసన్నపేట, మే 5(ఆంధ్రజ్యోతి): మాకివలసలో గ్రామదేవత అసిరితల్లి సిరిమానోత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలు ఘటాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి చల్లదనం, ప్రత్యేక పూజలు, ముర్రాటలను సమర్పించారు. 21 మంది విశ్వబ్రాహ్మణులు సిరిమానును సిద్ధం చేశారు. కూటిఘటం ఊరేగింపు చేపట్టారు. ఉత్సవాలకు బంధువులు రాకతో గ్రామం కిట కిటలాడింది. మంగళవారం సిరిమాను ఊరేగింపు, అమ్మవారి ఘటాలతో అసిరితల్లికి మొక్కులు చెల్లిస్తారు. గ్రామంలోకి ఎటువంటి వాహనాలు రాకుండా ఎస్‌ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. మాకివలస మీదుగా మబుగాం వెళ్లే వాహనాలు పోతయ్యవలస మీదుగా వెళ్లాలని, అలాగే కిళ్లాం వెళ్లే వాహనాలు ఈదులవలస మీదుగా వెళ్లాలని ఎస్‌ఐ సూచించారు.

బాలికను మోసగించిన కేసులో యువకుడి అరెస్టు

మెళియాపుట్టి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను మాయమాటలు చెప్పి హైదరాబాద్ తీసుకు వెళ్లి మోసగించిన కేసులో మండలంలోని గంగరాజ పురానికి చెందిన ప్రఫుల్లో ప్రదాన్(21)ను సోమవారం ఏఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పిన్నింటి రమేష్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఒక తన కుమార్తె కనిపించడం లేదని గతనెల 22న బాలిక తండ్రి ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై దర్యాప్తు చేపట్టగా గంగరాజపురానికి చెందిన ప్రఫుల్లో ప్రదాన్ బాలికను ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి హైదరాబాద్ తీసుకువెళ్లినట్లు తేలిందన్నారు. ఈ మేరకు సోమవారం పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. నిందితుడిని టెక్కలి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టండి

- తాగునీటికి ఇబ్బందులు రాకూడదు
- వివిధ శాఖల అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు


వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, మే 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ పరిధిలో రూ.6.13 కోట్లతో లక్షలతో ఆరు రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆ శాఖ ఈఈ రామకృష్ణ, డీఈఈ పొన్నాడ సుధాకర్, అల్లు చంద్రినాయుడులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. సోమవారం రాత్రి నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాబార్డు నిధులు రూ.1.69 కోట్లతో కురుడు-దంత-చిన్నసాన, రూ.57.58 లక్షలతో హైవే నుంచి కన్నేవలస-నారాయణపురం, సంతబొమ్మాళి మండలంలో రూ.1.41 కోట్లతో బోరుభద్ర నుంచి కొల్లిపాడు వరకు రోడ్డు పనులు చేపట్టాలన్నారు. అలాగే రూ.54.84 లక్షలతో హైవే కోటబొమ్మాళి నుంచి సంత బొమ్మాళి కాపుగోదాయవలస వరకు, రూ.87.53 లక్షలతో డీపీఎం రోడ్డు టు ఉద్దండ పాలెం, రూ.1.01 కోట్లతో డీపీఎన్ రోడ్డు నుంచి గంగరాం పనులు చేపట్టాలని సూచించారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి పరిధిలో రూ.17.50 లక్షలతో ఇరుకు వంతెనలు, రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. టెక్కలి-తెంబూరు రోడ్డు, సంతబొమ్మాళి, పాకివలస సమీపంలోని ఇరుకురోడ్లు బాగుచేయాలన్నారు. టెక్కలి-చెట్లతాండ్ర, టెక్కలి-రావివలస, తామరాపల్లి-దిమ్మిడిజోల రోడ్ల విస్తరణ చేయించాలని ఆర్‌అండ్‌బీ డీఈఈలు రవికాంత్, తిరుపతిరావు, ఏఈలు జగదీష్, హరనాథ్‌లకు సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రక్షిత నీటి పథకాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణకు ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి పలు వినతులన స్వీకరించారు.

మహానాడును విజయవంతం చేయండి: బగ్గు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, మే 5(ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న టీడీపీ మహానాడును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం నియోజకవర్గ క్లస్టర్, యూనిట్ ముఖ్య నాయకులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆదేశాలతో పార్టీ సభ్య త్వాలు 93 శాతం పూర్తి చేశామని, మిగిలిన లక్ష్యం త్వరలో పూర్తి చేయాలన్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా ముందుగా గ్రామస్థాయి కమిటీలను ఎన్నుకోవాలన్నారు. మహానాడు సభకు ఇప్పటి నుంచే క్యాడర్‌ను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు మిరియబిల్లి వెంకట అప్పలనాయుడు, భైరి భాస్కరరావు, రోణంకి కృష్ణంనాయుడు, గొద్దు చిట్టిబాబు, బగ్గు గోవిందరావు, వెలమల రాజేంద్రకుమార్, కత్తిరి వెంకటరమణ, సురవరపు తిరుపతిరావు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు: ఎంజీఆర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, మే 5(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్, యూనిట్ ఇన్ చార్జిలు, ముఖ్య నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వాల లక్ష్యం పూర్తి చేసిన వారికి అభినందించారు. సంస్థాగత ఎన్నికలకు సంసిద్ధం కావాలని, కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు పైల బాబ్జీ, ఎ.సన్యాసి, తూలుగు తిరుపతి రావు, యాళ్ల నాగేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జిలు సైలాడ సతీష్, బుద్ధల నరేష్, గోడ చందు తదితరులు పాల్గొన్నారు.

పలాస రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్యే శిరీష వినతికి స్పందించిన రైల్వే అధికారులు

పలాస, మే 5(ఆంధ్రజ్యోతి): పలాస రైల్వే స్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఈస్ట్‌కోస్ట్ సహాయ జనరల్ మేనేజర్ (ఏజీఎం) మోహిష్ కుమార్ బెహరా పేర్కొన్నారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లో ఆధునిక వసతుల కల్పనకు సంబంధించి లేఖన ఎమ్మెల్యే కార్యాల యానికి పంపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. ఫిబ్రవరి 2న పలాస రైల్వే స్టేషన్‌ను సందర్శించిన రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్‌ను ఎమ్మెల్యే గౌతు శిరీష కలిసి పలాస రైల్వే స్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. రైల్వే స్టేషన్‌లో పరిశుభ్రత, హైజెనిక్ వాష్ రూములు, తాగునీటి సరఫరా, విభిన్న ప్రతిభావంతులకు తగు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై ఏజీఎం స్పందిస్తూ.. పరిశుభ్రమైన మరుగుదొడ్ల నిర్మాణానికి తగు ఆదేశాలిచ్చామని, అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా ఆధునీకరణ చేయాలని కోరామన్నారు. స్టేషన్‌లో మొత్తం ఆరు ఆధునిక వాటర్ కూలర్లు ఏర్పాటు చేస్తున్నామని, విభిన్న ప్రతిభావంతులకు మరిన్ని సదుపాయాలు సమకూర్చాలని ఆదేశాలిచ్చామన్నారు పలాస రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ అధీనంలోను, సీసీ కెమెరాల నిఘాలో ఉందని, ఈస్ట్‌కోస్ట్ రైల్వేలో ఆధునిక రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు, నిరంతర సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలాస స్టేషన్ అభివృద్ధికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో ఎమ్మెల్యే శిరీష చేస్తున్న కృషిపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

250 మెట్రిక్ టన్నుల పశుదాణా పంపిణీకి చర్యలు

- పశు సంవర్థక శాఖ డీడీ డా.జయరాజ్



టెక్కలి, మే 5(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ టెక్కలి డివిజన్ పరిధిలో 250 మెట్రిక్ టన్నుల పశుదాణాను పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా. జయరాజ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పశు దాణా పంపిణీకి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. పశుదాణా బస్తా రూ.1,110 కాగా దారిద్ర్యరేఖకు దిగువ ఉండి రెండు ఆవులు, ఒక పడ్డ ఉన్న రైతుకు రూ.555లకే సబ్సిడీపై అందించనున్నామన్నారు. ప్రతి మండలానికి తొలి విడతలో 155 మంది రైతులకు ఈ అవకాశం లభించనుం దన్నారు. పశుదాణా అవసరమైన వారు సంబంధిత పశువైద్యాధి కారుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

నేటినుంచి పెంటూరులో ఆలయ వార్షికోత్సవాలు

నందిగాం, మే 5(ఆంధ్రజ్యోతి): పెంటూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయ 23వ వార్షికోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు బొడ్డ జనార్దన రావు, బొడ్డ కృష్ణారావు తెలిపారు. మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

- జలుమూరు మే 5(ఆంధ్రజ్యోతి): గొటివాడ శ్రీ రమాసహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు మంగళవారం నుంచి 8వ తేదీ వర కు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మొయ్యి లక్ష్మణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

నందిగాం, మే 5(ఆంధ్రజ్యోతి): పెంటూరు కాశీవిశ్వేశ్వరస్వామి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ధర్మకర్తలు అట్టాడ ఠాగూర్, టి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రాజుల చెరువు బాగుపడేనా?

(ఐదో పేజీ తరువాయి)

పెట్టడంతో మరింత దుర్వాసన వస్తోంది. ఈ చెరువును పార్కుగా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 2017లో ప్రతిపాదనలు పంపారు. 2022లో అనాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి చెరువు అభివృద్ధికి రూ.10కోట్లు కేటాయిస్తానని నరసన్నపేట బహిరంగ సభలో ప్రకటించారు. కానీ నిధులు కేటాయించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా రాజుల చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం



రాజులు చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ఈ చెరువును ఆహ్లాదంగా తీర్చిదిద్దిందేకు చర్యలు చేపడతాం.

- బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే, నరసన్నపేట

చెరువును అభివృద్ధి చేయాలి



ఎన్నో వందల ఏళ్ల చరిత్ర కలిగిన రాజుల చెరువును వదిలేస్తున్నారు. ఎంతో విశాలంగా ఉన్న చెరువు ఆక్రమణలతో కుచించుకుపోయింది. పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ చెరువును అభివృద్ధి చేయాలి.

- వైశ్యరాజు కృష్ణంరాజు, శ్రీరామనగర్

దృష్టి సారించాలి



అధికారులు, పాలకులు ప్రజలందరికీ ఉపయోగపడే రాజుల చెరువు అభివృద్ధిపై దృష్టి సారించాలి. చెరువును కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. చెరువు చుట్టూ అభివృద్ధి పనులు చేపట్టాలి.

- పీస కృష్ణ, జగన్నాథపురం, నరసన్నపేట

మంచిరోజులు వస్తాయి



పట్టణ ప్రజలకు ఉపయోగపడే చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉంది. రాజుల చెరువును పర్యాటక ప్రాంతంగా తయారు చేసేందుకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట ఇచ్చారు. ఇప్పటికే అధికారులు దీనిపై కసరత్తు చేస్తున్నారు. పట్టణానికి మంచిరోజులు వస్తాయి.

- జామి వెంకటరావు, ఎంపీటీసీ, నరసన్నపేట

పోర్టు నిర్వాసిత కాలనీల్లో మౌలిక వసతులు: ఆర్డీవో


విష్ణుచక్రం నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, మే 5(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసిత కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. విష్ణుచక్రం గ్రామస్థులకు నౌపడా సమీపంలో ఏర్పాటు చేయనున్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వద్ద తాత్కాలిక షెడ్ల ఏర్పాటును సోమవారం ఆయన పరిశీలించారు. విష్ణుచక్రం గ్రామస్థులకు ఇప్పటికే లేఅవుట్లు కేటాయించగా పోర్టు యంత్రాంగం సాయంతో తాత్కాలిక షెడ్ల ఏర్పాటుకు సంబంధించి గ్రామస్థులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో రోడ్లు, కాలువలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యాలను ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామని ఆర్డీవో తెలిపారు. నిర్వాసిత కాలనీల్లో మౌలి క వసతులను కల్పించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమం లో ఆయా శాఖల అధికారులు, నిర్వాసితులు పాల్గొన్నారు.

'పూడిలంక' రోడ్డు హామీ అమలుపై హర్షం

వజ్రపుకొత్తూరు, మే 5(ఆంధ్రజ్యోతి): పూడిలంక రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఉపాధి హామీ నిధుల నుంచి రూ.4 కోట్లు మంజూరుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్క ర్ అంగీకరించడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు సదరు ప్రదేశం వద్ద గ్రామస్థులతో కలిసి టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు తదితరులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కూటమి అభ్యర్థిగా ఇప్పటి ఎమ్మెల్యే గౌతు శిరీష ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. పూడిలంక సమస్య పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు సహకారం మరువలేనిద్నారు. కార్యక్రమంలో నాయకులు బుల్లోజు శశి భూషణ్, పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, గొరకల వసంతస్వామి, పోతన పల్లి సాంబమూర్తితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ముస్లింలను విచారించాలి

నరసన్నపేట, మే 5(ఆంధ్రజ్యోతి): వ్యాపా రాల పేరుతో పలు వురు ముస్లింలు పట్ట ణానికి వస్తున్నారని, కొందరు ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారని, అటువంటి వారు ప్రభుత్వ నిబంధనల మేరకు నివాసముంటున్నారా లేదా అన్న అనుమానాలున్నాయని విచారణ చేప ట్టాలని పలు సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం బీజేపీ, వీహెచ్‌పీ, సమరసత వేదిక సభ్యులు తహసీల్దార్ సత్యనారాయణ, సీఐ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాలు అందించారు. దేశభద్రతకు సంబంధించి సమస్యలు ఉత్పన్నం అవుతున్న నేపథ్యంలో తగు శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. వారి గుర్తింపు కార్డు లను, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏపీ మహారణ, ఆయా సంఘాల ప్రతినిధులు టంకాల సూరప్పడు, కేఎల్ఎన్‌మూర్తి, చింతు పాపారావు, వారణాశి సంతోషి, కోరాడ రామచంద్రరావు, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.65 లక్షలతో ఆరు శ్మశాన వాటికల అభివృద్ధి

పలాస, మే 5(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.65 లక్షలతో ఆరు శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తున్నట్లు కమిషనర్ ఎన్.రామారావు తెలి పారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. శ్మశాన వాటికలకు రక్షణ గోడ నిర్మాణానికి ఈ నిధులు వెచ్చిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయపురం, సూదికొండ, కాశీబుగ్గ శ్మశాన వాటికలకు రూ.15 లక్షలు చొప్పున, కేటీ రోడ్డులోని షైనా ర్టీల శ్మశానానికి రూ.7.50 లక్ష లు, నీలాపురం శ్మశానం అభివృద్ధికి రూ.2 లక్షలు వెచ్చిస్తున్నారు. వీటిలో ఇప్పటికే ఉదయ పురం, సూదికొండ శ్మశానాలకు రక్షణగోడ పూర్తయింది. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ● మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 వినతులు వచ్చినట్లు కమిషనర్ రామారావు తెలిపారు. జనన, మరణ ధ్రువపత్రాలు, వితం తు పింఛన్లు, ఆస్తిపన్ను పేర్లు మార్పిడి, తాగునీటి సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి శివాజీ పరామర్శ

హరిపురం, మే 5(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నేతల కుటుంబ సభ్యులను మాజీ మంత్రి గౌతు శివాజీ సోమవారం పరామర్శించారు. ఎల్.కొత్తూరులో శంకర్ గొల్లలపాలెంలో నర్తు రామారావు కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయా కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నాయకులు జీకే నాయుడు, దాసరి తాతారావు, బమ్మిడి కర్రయ్య, లబ్బ రుద్రయ్య, మండల లచ్చయ్య తదితరులుపాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో కలకలం

(ఐదో పేజీ తరువాయి)

వద్దకు వెళ్లింది. ఆత్మహత్యాయత్నాన్ని గమనించిన ఓ మహిళా పోలీసు వెంటనే మంగ మ్మను నిలువరించి, అఘాయిత్యానికి పాల్పడకుండా అడ్డుకుంది. అనంతరం కలెక్టర్ ఆ వృద్ధు రాలిని గ్రీవెన్స్ హాలు నుంచి ప్రత్యేక గదిలోకి తీసుకువెళ్లారు. అనంతరం డీఆర్వో ఎం.వేంకటే శ్వరరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష కూడా కలెక్టర్ రూమ్‌లోకి వెళ్లారు. సమస్యను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ ఆస్తి విషయం తగాదా హైకోర్టులో ఉండడంతో, ముందు కోర్టులో ఇచ్చిన డిక్రీ ప్రకారం వారికి న్యాయం చేయాలని తహసీల్దార్, పోలీసులను ఆదేశించారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయాధికారి రోషిణి

పాతపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): నిరుపేద అసంఘటిత కార్మికులకు ఉచితంగా న్యాయ సేవలను అందించనున్నామని, వీటిని వినియోగించుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి మానెం రోషిణి అన్నారు. అసంఘటిత కార్మికుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక కోర్టు ఆవరణలో సోమ వారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మికులు తమ వివరాలను కార్మికశాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. న్యాయవాది జి.సూర్యారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

టెక్కలి, మే 5(ఆంధ్రజ్యోతి): డివిజన్ స్థాయిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సూచించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా 14 అర్జీలు స్వీకరించారు. వీటిని సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆయన సూచించారు.

న్యూస్ బాక్స్

జాబ్‌మేళాను వినియోగించుకోండి

నరసన్నపేట, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఒక ప్రకటనలో కోరారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ పూర్తి చేసిన అభ్యర్థులు నేరుగా హాజరు కావాలని సూచించారు. ఈ మేళాను నిరుద్యోగులు వినియోగించుకుని ఉపాధి పొందాలని కోరారు.

14 నుంచి కొల్లిపాడులో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

సంతబొమ్మాళి, మే 5(ఆంధ్రజ్యోతి): కొల్లి పాడు తారకేశ్వరస్వామి ఆలయ శతాబ్ది వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 14వ తేదీ నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జునరెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు, మూడు, నాలుగు స్థానాలు పొందిన జట్లకు రూ.15 వేలు చొప్పున నగదు, జ్ఞాపికలను అందించనున్నామన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్, బెస్ట్ ఆల్ రౌండర్లకు బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న జట్లు 95151 78373 నెంబరులో సంప్రదించాలని కోరారు.

అనాథలకు ఆర్థిక సాయం

పలాస, మే 5(ఆంధ్రజ్యోతి): తండ్రిని కోల్పోయి అనాథలుగా మారిన ముగ్గురు బాలికలను ఆదుకునేందుకు గాను హ్యాండ్స్ టుగెదర్ ట్రస్టు నిర్వాహకులు ముందుకు వచ్చారు. ఈ మేరకు సోమవారం రూ.21 వేల నగదును బాలికల కుటుంబ సభ్యులకు అందించారు. సూదికొండ కాలనీకి చెందిన బాలికల తండ్రి ఇటీవల మృతి చెందగా తల్లి చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని సంస్థ ప్రతినిధులు స్పందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఆదినారాయణ, కూర్మారావు, కోదండరావు, గణపతి పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మెళియాపుట్టి, మే 5(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్‌పండా తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన జరుగు సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో రావాలని కోరారు.

సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలి

హరిపురం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగునీటి వనరులను అభివృద్ధి చేసి రైతులకు ఆదుకోవాలని మహేంద్ర రైతు సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ హైమావతికి వినతిపత్రం అందజేశారు. డబార్సింగి, కళింగదల్, దామోదరసాగర్, మహేంద్రతనయ, సునాముది వంటి పలు నీటివనరుల గేట్లు, మదుములు అధ్వానంగా తయారయ్యాయని, మరమ్మతులు చేయాని కోరారు. సాగునీటి కాలువల్లో పూడిక, గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో కొర్ల హేమారావుచౌదరి, శిష్టు బాబ్జి, బి.కోదండరావు, నరేష్ పాల్గొన్నారు.

జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి

హరిపురం, మే 5(ఆంధ్రజ్యోతి): జీడి పంటకు మద్ధతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని చైతన్య రైతు సమస్యల సాధన కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు కోరారు. సోమవారం హరిపురం మార్పు ట్రస్టు భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది జీడి పంట దిగుబడి లేక రైతులు నష్టాల ఊబిలో కూరుకు పోయాడని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి 80 కేజీల బస్తా రూ.16 వేలకు మద్దతుధర ప్రకటించి కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు నల్ల హడ్డీ, సోమ నాథం పాల్గొన్నారు.

తెంబూరులో నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

పాతపట్నం, మే 5(ఆంధ్రజ్యోతి): తెంబూరు గ్రామంలో జరుగుతున్న గ్రామదేవత ఉత్సవాల సందర్భంగా రెండు రోజులపాటు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీఐ వి.రామారావు తెలిపారు. మంగళ, బుధవారాల్లో ఉత్సవాలకు భక్తులు ఎక్కువగా రానున్నందున భారీ వాహనాలు తెంబూరు మీదుగా వెళ్లేందుకు అనుమతులు లేవన్నారు. ఆర్టీసీ బస్సులు టెక్కలి నుంచి తెంబూరు వరకు, అలాగే పాతపట్నం నుంచి తెంబూరు రైల్వే స్టేషన్ వరకు నడపనున్నారన్నారు.

భూమి క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

పలాసరూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): మండలం, మునిసిపాలిటీల్లో అనధికారికంగా ఆక్రమిత అభ్యంతకరం లేని ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్నవారు సదరు భూముల క్రమబద్ధీకరణకు మంగళవారం నుంచి డిసెంబరు నెలాఖరులోగా దరఖాస్తు చేసు కోవాలని తహసీల్దార్ ఎస్.కల్యాణ చక్రవర్తి ఒక ప్రకటనలో కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించి సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు.